# అందం

"జయ చూడండి. ఎంత అందంగా ఉందో..."
"ఏం మా వాడికి మాత్రం ఏమైంది?"

## -మాధవరావ్ గోఖలే

"ఏమైందని నేనన్నానా? ప్రభాకర్ మా జయ ముందు దిగ దుడుపే."

"అంటే? అందగాడు కాదనేనా నీ అభిప్రాయం?"

"అవునండి, 'అందం' అందరికీ రాదు."

"కాదు! అందాన్ని మనస్సుతో చూడాలి శారీరకంగా కాదు" 'సృష్టిలో ప్రతి వస్తువూ అందమైనదే, పనికి వచ్చేదే' అవసరం లేని వాటిని వికారంగా చూడడంతోనే ఉంది తేడా."

"అబ్బా! అలాగా!..." వెక్కిరింత ధ్వనించింది.

మా ఆవిడకి 'అందం' పిచ్చి. తనో అందగత్తెనని ప్రతి వస్తువూ అందమైందే కావాలంటుంది.

"అవును, అదే నిజం! మనం అనాకారిగా చూసిన వస్తువు మనకు అత్యవసరమై, దొరకనపుడు మరింత అందంగా కనబడుతుంది."

"భలే లెక్చర్ ఇచ్చారు! మొత్తానికి, పంతుళ్ళబుద్ధి



పోనిచ్చుకున్నారు కాదు."

"నా ఉద్యోగమే అది. అయినా నీ అభిప్రాయం **కొంచెం** మార్చుకో."

"నెవర్! మీరసలు అందంగా లేకపోయినా మిమ్మల్ని నా అంత అందగత్తె పెళ్ళి చేసుకుందని మీకు జెలసీ! మీరే మార్చుకోండి మీ అభిప్రాయాన్ని."

వాతావరణం వేడిగా మారేసరికి నేను మౌనం దాల్చాను.

నేనో పల్లెటూర్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను.

ఈ మధ్యనే మా ఆవిడకి ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా జాబు వచ్చింది. బంధువులొకరింట్లో పెళ్ళికి వెళ్ళొస్తున్నాం. ఎండాకాలం కావడంచేత నడవబుద్ధేయక బస్టాండు నుండి ఇంటికి రిక్షాలో బయలుదేరాం.

ఆ రిక్షా అబ్బాయిని చూసి అసహ్యించుకుంటూనే రిక్షా ఎక్కి తన చెల్లెలు జయ గురించీ, మా పెద్దనాన్నగారి అబ్బాయి గూర్చి మొదలుపెట్టీ, ఆ రిక్షావాడినీ, నన్నూ, మా ప్రభాకర్‌నూ, దెప్పిపొడుస్తోంది 'అందం' టాపిక్ ఎత్తి.

ప్రభాకర్‌కు తన చెల్లెల్నిచ్చి పెళ్ళిచేయాలని నా తలంపు.

ప్రభాకర్ అందగాడు కాకపోయినా మరీ కురూపి కాడు. తన కుటుంబాన్ని ఏ బాదరబందీ లేకుండా పోషించుకోగల స్తోమతా, ప్రభుత్వోద్యోగం కలవాడు.

రిక్షా అబ్బాయి మెల్లగా నడుపుతున్నాడు ఎండకు తాళలేక. పాపం సన్నగా ఉన్నాడు. అంతేగాక నల్లగా, చాలారోజుల నుండి నూనె చూడని చింపిరవందర జుట్టూ, మాసిన బట్టలూ, ఇదీ అతని వాలకం.

ఈ వాలకం మా ఆవిడకు నచ్చలేదు. అందంగా ఉన్న రిక్షావాడే కావాలంటే ఎలా?

ఈ పిచ్చి అపుడపుడు నన్ను కూడా ఇబ్బందుల్లో పడేస్తుంది.

అప్పుడప్పుడూ నేను మౌనాన్ని శరణుకోరుతానంతే! వాతావరణం తాత్కాలికంగా చల్లగా మారినా మా ఇద్దరి అభిప్రాయాలు ఈ విషయంలో మారలేదు.

ఎండ తీవ్రంగా ఉంది. చేతిగుడ్డతో చెమట తుడుచుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు రిక్షావాడు.

ఓ చిన్న టీ బంకు కనపడితే నీళ్ళు తాగి వస్తానని రిక్షావాడు రిక్షా ఆపి వెళ్ళాడు.

తిరిగి వచ్చాక అడిగాను "నీ పేరేంటి బాబు?"

"యాదగిరండీ."

మా ఆవిడ మొహం చూసాను. అసహ్యంగా పెట్టింది. పాపితో మీకేమిటి మాటలన్నట్టు.

బారీ కుదుపులకు మేము కూడా భారీగానే కదుల్తున్నాం రిక్షాలో.

రోడ్డంతా గుంటలు. కంకరరాళ్ళు పోసారేమో రిక్షాడిగ లాగుతున్నాడు.

మొత్తానికి పదిహేను నిమిషాల్లో ఇల్లు చేరాం.

తాళం తీసి రిక్షావాడికి డబ్బిచ్చి పంపేశాను.

భార్యామణి లోపలికెళ్ళి ఇల్లు సర్దుకోవడంలో మునిగిపోయింది.

నేను కుర్చీలో కూలబడ్డాను! ఫ్యానుగాలికి ఓ కును కు పట్టింది.

అలా నిద్రపోయానో, లేదో...

భార్యామణి గావుకేక వినబడింది బాత్రూంలో నుండి.

"ఏమయింది? ఎందుకా కేకలు." నా నిద్రపాడు చేసిందన్న కోపంతో అడిగాను బాత్రూం దగ్గరకెళ్ళి.

"మరి... మరి... నా..."

"నస పెట్టక ఏమయిందో చెప్పు."

"నా మంగళ సూత్రం ఎక్కడో పడిపోయిందండీ, మెడలో లేదు." కన్నీళ్ళతో జవాబు.

"ఎక్కడికి పోతుందీ! ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటుంది. జాగ్రత్తగా వెదుకు. అయినా అంత పర ధ్యాన్నంగా ఎలా ఉన్నావు?"

"మూడు తులాల బంగారంతో చేసిన తాళి అది."

"అవునండీ దారం పాతబడిందని ఈరోజో, రేపో, కొత్తది వేసుకుందామనుకున్నాను. ఇంతలోనే..."

నీట్‌గా సర్దిన ఇల్లు చిందరవందరగా మారడానికి ఎంతో సమయం పట్టలేదు.

ఇల్లంతా వెదికినా దొరకలేదు మంగళసూత్రం.

భార్యామణి 'అందం'గా ఏడుస్తోంది.

ఎంత ఏడ్చినా పోయిన వస్తువు దొరకలేదు.

"అయ్యా..." ఎవరిదో వాకిట్లోనుండి పిలుపు.

"ఎవరదీ?" నా చావు నేను చస్తూంటే మధ్యలో వీళ్ళెవరో? విసుగుతోనే వెళ్ళాను.

"నేనయ్యా! యాదగిరిని."

"ఆ! నువ్వా... ఏమిటీ?" కోపం ప్రదర్శించాను.

"ఇదిగోనయ్యా! ఈ తాళిబొట్టు నా రిక్షాలో పడుంది. ప్రొద్దున్నుండీ ఏ సవారీ దొరకలేదు. మీరు తప్ప నా రిక్షాలో ఎవరూ ఎక్కలేదు. అమ్మగారి దనుకుంటాను. తెగి పడిపోయుంటుంది. తీసుకోండయ్యా."

నల్లటి మొరటు చేతిలో నా భార్య తాళి! పోయిన ప్రాణం తిరిగొచ్చినంత పనైంది మా ఇద్దరికి.

"ఒక ఇల్లాలి తాళి తీసుకొని అమ్మేసి వాడుకుంటే ఆ అమ్మ ఉసురు తగుల్తుందయ్యానాకు. అందుకే ఇచ్చేద్దామని వచ్చాను." యాదగిరి అన్నాడు.

మా ఆవిడ మొహం చూశాను. ఆముదం తాగినట్లుగా ఉంది.

"కొంచెం మంచినీళ్ళు ఇప్పించండయ్యా" అరుగు మీద కూర్చుంటూ అన్నాడు యాదగిరి.

పరుగెత్తికెళ్ళి చెంబులో నీళ్ళు తెచ్చింది భార్యామణి.

పోయిన వస్తువును నిజాయితీగా తీసుకొచ్చిన యాదగిరి నాకళ్ళకి నిజంగా చాలా అందంగా కనిపించాడు.

ఓ వంద రూపాయలివ్వబోతే వద్దన్నాడు. బలవంతాన తీసుకునీ, వెళ్ళిపోయాడు.

అనాకారీ, కురూపి అయిన యదగిరి చేసిన ఈ పని నా భార్యకు 'అందం' పైనున్న అభిప్రాయాన్ని మార్చింది, అహంకారాన్నీ తొలగించింది.

మా.రా. గోఖలే,
తపాలా కార్యాలయం,
కమ్మరపల్లి - 503 308.




టి. సురేష్, ( తెలు) , కేరాఫ్ : టి. చంద్రయ్య , ఇం.నెం. 6 - 18 - 111 , ఆదర్శ నగర్, నిజామాబాద్. 503 002